ఐపీఎల్‌ను వీడుతున్న ఇంగ్లండ్ క్రికెటర్లు

ఢిల్లీ: మార్చి మాసాంతం నుంచి జరుగుతున్న ఐపీఎల్-17లో ఇంగ్లండ్ ఆటగాళ్లు ఒక్కొక్కరుగా వీడ్కోలు పలుకుతున్నారు. త్వరలో మొదలుకాబోయే టీ20 ప్రపంచకప్ సన్నాహకాల్లో భాగంగా ఇంగ్లండ్.. పాకిస్థాన్‌తో టీ20 సిరీస్ ఆడాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఇంగ్లండ్ ఆటగాళ్లు ఈ సీజన్‌కు గుడ్‌బై చెబుతున్నారు. శనివారమే లివింగ్‌స్టాన్ (పంజాబ్) లండన్‌కు వెళ్లిపోగా సోమవారం జోస్ బట్లర్ (రాజస్థాన్), విల్ జాక్స్, రీస్ టాప్లీ (బెంగళూరు) కూడా యూకే ఫ్లైట్ ఎక్కేశారు. కేకేఆర్ ఓపెనర్ ఫిల్ సాల్ట్, చెన్నై ఆల్‌రౌండర్ మోయిన్ అలీ కూడా రేపో మాపో ఇంగ్లండ్‌కు వెళ్లనున్నారు. ప్లేఆఫ్స్‌కు చేరే ఫ్రాంచైజీలు ఇంగ్లండ్ ఆటగాళ్లు లేకుండానే బరిలోకి దిగనున్నాయి.

షాట్‌పుట్‌లో జాతీయ రికార్డు

భువనేశ్వర్: మహారాష్ట్ర అథ్లెట్ అభా ఖటువ షాట్‌పుట్‌లో సరికొత్త జాతీయ రికార్డు నెలకొల్పింది. భువనేశ్వర్ వేదికగా జరుగుతున్న నేషనల్ ఫెడరేషన్ కప్ పోటీలలో భాగంగా సోమవారం అభా.. షాట్‌పుట్‌ను 18.41 మీటర్ల దూరం విసిరి కొత్త జాతీయ రికార్డు సృష్టించింది. గతంలో అభా.. మన్‌ప్రీత్ కౌర్‌తో కలిసి 18.06 మీటర్ల రికార్డును పంచుకుంది. ఈ ప్రదర్శనతో ఆమె ఒలింపిక్ అర్హత (18.80 మీటర్లు)కు కొద్దిదూరంలోనే నిలిచింది. షాట్ పుట్ విభాగంలో ఇప్పటిదాకా ఒక్క మహిళా అథ్లెట్ కూడా పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించలేదు.

7 మ్యాచ్‌లే మిగిలున్నా ఖరారు కాని ప్లేఆఫ్స్ బెర్తులు

రేసు రసవత్తరం!

పోటీలో 6 జట్లు 3 స్థానాలు • టాప్-4లో నిలిచేదెవరు?

నెలన్నర రోజులుగా క్రికెట్ అభిమానులను ఉర్రూతలూగిస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్-17) కీలక దశకు చేరుకుంది. లీగ్ స్టేజీలో ఏడు మ్యాచ్‌లే మిగిలున్న ఈ టోర్నీలో ఇప్పటివరకు కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) మాత్రమే అధికారికంగా ప్లేఆఫ్స్ బెర్తును ఖరారుచేసుకుంది. మిగిలిన మూడు స్థానాల కోసం ఏకంగా ఆరు జట్లు రేసులో ఉన్నాయి. నాకౌట్ దశకు చేరే ఆ మూడు జట్లపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ఢిల్లీ: ఏడు మ్యాచ్‌లు.. ఆరు జట్లు.. మూడు బెర్తులు..! ఐపీఎల్-17లో సోమవారం కోల్‌కతా నైట్ రైడర్స్-గుజరాత్ టైటాన్స్ (జీటీ) మ్యాచ్ రద్దు అయ్యేసరికి ఉన్న సమీకరణం. అహ్మదాబాద్‌లో వర్షం కారణంగా కేకేఆర్-జీటీ మ్యాచ్ రద్దవడంతో ప్లేఆఫ్స్ రేసు నుంచి గుజరాత్ అధికారికంగా నిష్క్రమించినా రాజస్థాన్, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ, లక్నో ఇంకా పోటీలోనే ఉన్నాయి. మరి టాప్-4లో నిలవాలంటే ఏ జట్టుకు అవకాశాలున్నాయి..? ఆరింటిలో ప్లేఆఫ్స్ వెళ్లే ఆ మూడు జట్లు ఏవి..?

రాజస్థాన్ రాయల్స్..

సీజన్ ఆరంభంలో వరుస విజయాలతో అందరికంటే ముందే ప్లేఆఫ్స్ బెర్తు దక్కించుకుంటుందనుకున్న రాజస్థాన్ రెండో దశ నుంచి తడబడుతోంది. అయినా పాయింట్ల పట్టికలో 16 పాయింట్లతో ఆ జట్టు రెండో స్థానంలో ఉంది. నెట్ రన్ రేట్ (+0.349) కూడా మెరుగ్గానే ఉంది. శాంసన్ సేనకు మరో రెండు మ్యాచ్‌లు మిగిలున్నాయి. నేడు (మంగళవారం) ఢిల్లీ-లక్నో మధ్య జరిగే మ్యాచ్‌లో ఢిల్లీ గెలిస్తే రాజస్థాన్ బెర్తును ఖాయం చేసుకున్నట్టే. ఒకవేళ లక్నో గెలిచినా రాయల్స్ తర్వాతి రెండు మ్యాచ్‌లలో ఒకటి నెగ్గితే ఆ జట్టు నాకౌట్ దశకు చేరుతుంది.

చెన్నై సూపర్ కింగ్స్..

రెండ్రోజుల క్రితం రాజస్థాన్‌తో మ్యాచ్ గెలవడం చెన్నై ఆశలను సజీవంగా ఉంచింది. ఏడు విజయాలు 14 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్న సీఎస్‌కే.. +0.528 రన్‌రేట్‌తో మెరుగైన స్థానంలోనే ఉంది. ఆ జట్టు చివరి లీగ్ మ్యాచ్‌ను ఈనెల 18న బెంగళూరుతో ఆడాల్సి ఉంది. ఈ పోరులో నెగ్గితే సీఎస్‌కే ఖాతాలో 16 పాయింట్లు చేరతాయి. ఒకవేళ ఓడినా హైదరాబాద్, లక్నో జట్లు తమ తదుపరి మ్యాచ్‌లలో ఓడితే ప్లేఆఫ్స్ చేరే అవకాశముంటుంది.

సన్‌రైజర్స్ హైదరాబాద్..

ఉప్పల్‌లో లక్నోపై భారీ విజయం హైదరాబాద్‌కు కలిసొచ్చింది. ఎస్‌ఆర్‌హెచ్ ఖాతాలో 14 పాయింట్లు ఉండగా ఆ జట్టు మరో 2 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఈ రెండింటిలో ఒక్కటి గెలిచినా హైదరాబాద్ టాప్-4లో నిలుస్తుంది. రెండూ గెలిస్తే టాప్-2కు వెళ్లే అవకాశం లేకపోలేదు. అలాకాకుండా రెండు మ్యాచ్‌లలో ఓడితే మాత్రం చెన్నై, బెంగళూరు (సీఎస్‌కేపై గెలిస్తే), లక్నో.. ఎస్‌ఆర్‌హెచ్‌ను అధిగమించే ప్రమాదమూ పొంచిఉంది.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు..

ఈ సీజన్ తొలి దశలో వరుసగా ఆరు మ్యాచ్‌లు ఓడి అసలు అందరికంటే ముందే బిస్తరు సర్దేస్తుందనుకున్న ఆర్సీబీ అనూహ్యంగా ప్లేఆఫ్స్ రేసులోకి దూసుకురావడం ఆశ్చర్యమే. వరుసగా ఐదు విజయాలతో 12 పాయింట్లు ఖాతాలో ఉన్న బెంగళూరు.. 18న సొంతగడ్డపై చెన్నైని ఢీకొనాల్సి ఉంది. ఈ మ్యాచ్‌లో బెంగళూరు మొదట బ్యాటింగ్ చేస్తే చెన్నైని 18 పరుగుల తేడాతో ఓడించాలి. ఒకవేళ ఛేదనకు దిగాల్సి వస్తే లక్ష్యాన్ని 18.1 ఓవర్లలో పూర్తి చేయాల్సి ఉంటుంది. అప్పుడు మెరుగైన రన్‌రేట్‌తో ఆర్సీబీ సైతం ప్లేఆఫ్స్ రేసులోకి వస్తుంది. అయితే అంతకంటే ముందే.. హైదరాబాద్, లక్నో తాము తర్వాత ఆడబోయే మ్యాచ్‌లలో గెలిస్తే బెంగళూరుకు మరోసారి వామహస్తమే.

ఢిల్లీ క్యాపిటల్స్..

బెంగళూరు చేతిలో ఓటమి ఢిల్లీని దారుణంగా దెబ్బతీసింది. అనధికారికంగా ఆ జట్టు టాప్-4 రేసులో లేకున్నా.. లక్నోతో మ్యాచ్‌లో గెలిచి లక్నో, హైదరాబాద్ తమ మిగిలిగిన మ్యాచ్‌లలో ఓడితే అప్పుడు ఢిల్లీకి అవకాశముంటుంది.

లక్నో సూపర్ జెయింట్స్..

హైదరాబాద్‌తో పరాజయం లక్నో ప్లేఆఫ్స్ అవకాశాలకు అడ్డుకట్ట వేసింది. పాయింట్ల పట్టికలో ఏడో స్థానం (12 పాయింట్లు)లో ఉన్న రాహుల్ సేన.. మరో రెండు మ్యాచ్‌లలో గెలిస్తే 16 పాయింట్లకు చేరుతుంది. అది కూడా భారీ తేడాతో గెలిచి నెట్ రన్ రేట్ (ప్రస్తుతం -0.769) మెరుగుపరుచుకోవాలి. అదే సమయంలో హైదరాబాద్, చెన్నై, ఢిల్లీ మ్యాచ్‌లలో పరాభవాలు ఎదురుకుంటే లక్నోకు ఛాన్స్ ఉంటుంది.

పాయింట్ల పట్టిక

జ	ఆ	గె	ఓ	ఫ.తే.	ర	పా
కోల్‌కతా	13	9	3	1	1.42	19
రాజస్థాన్	12	8	4		0.34	16
చెన్నై	13	7	6		0.52	14
హైదరాబాద్	12	7	5		0.40	14
బెంగళూరు	13	6	7		0.38	12
ఢిల్లీ	13	6	7		-0.48	12
లక్నో	12	6	6		-0.76	12
గుజరాత్	13	5	7	1	-1.06	11
ముంబై	13	4	9		-0.27	8
పంజాబ్	12	4	8		-0.42	8

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు ఫ.తే. : ఫలితం తేలనివి.

టైటాన్స్ ప్లేఆఫ్స్ ఆశలు గల్లంతు

టాస్ కూడా పడకుండానే గుజరాత్-కోల్‌కతా మ్యాచ్ రద్దు

అహ్మదాబాద్: నిండు వేసవిలో అహ్మదాబాద్‌ను ముంచెత్తిన అకాల వర్షం.. ఐపీఎల్‌లో రెండుసార్లు ఫైనల్‌కు చేరిన గుజరాత్ టైటాన్స్ ప్లేఆఫ్స్ ఆశలపై నీళ్లు చల్లింది. అహ్మదాబాద్ లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా సోమవారం కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరగాల్సిన మ్యాచ్ వరుణుడి అంతరాయంతో టాస్ పడకుండానే రద్దయ్యింది. సాయంత్రం నుంచే ఉరుములతో కూడిన వర్షం గుజరాత్‌కు షాకిచ్చింది. ఇరు జట్ల సారథులతో చర్చించిన అంపైర్లు.. రాత్రి 10:42కు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. రెండు జట్లకూ చెరో పాయింట్ కేటాయించినా టైటాన్స్‌కు అసంతృప్తి తప్పలేదు. ఈ సీజన్‌లో ఒక మ్యాచ్ వర్షార్పణమవడం ఇదే ప్రథమం.

ఇషా సింగ్‌కు పారిస్ బెర్తు

మనూ బాకర్, అనిష్, విజయ్‌వీర్‌కూ అవకాశం

భోపాల్: హైదరాబాదీ షూటర్ ఇషా సింగ్ పారిస్ ఒలింపిక్స్ బెర్తును దక్కించుకుంది. భోపాల్ వేదికగా జరుగుతున్న ఒలింపిక్ సెలక్షన్ ట్రయల్స్‌లో భాగంగా మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్ టీ4లో భారత స్టార్ షూటర్ మనూ భాకర్ 586 స్కోరు చేయగా ఇషా సైతం 586 పాయింట్లతో టాప్-2లో నిలిచి పారిస్ కోటాను ఖాయం చేసుకున్నారు. ఇదే కేటగిరీలోని పురుషుల విభాగంలో అనిష్ భన్వాలా, విజయ్‌వీర్ సింగ్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించారు.

నిఖత్ తొలి పంచ్ అదుర్స్

అస్తానా: పారిస్ ఒలింపిక్స్‌కు ముందు అస్తానా (కజకిస్థాన్) వేదికగా జరుగుతున్న ఎలోర్డ కప్‌లో వరల్డ్ చాంపియన్, తెలంగాణ యువ బాక్సర్ నిఖత్ జరీన్ తొలిరౌండ్‌లో అదరగొట్టింది. సోమవారం జరిగిన మొదటి రౌండ్‌లో నిఖత్ (52 కిలోల విభాగంలో).. 5-0 తేడాతో రఖైంబెర్డి జన్సాయాను ఓడించింది. బౌట్ ఆరంభం నుంచే ప్రత్యర్థిపై పదునైన పంచ్‌లతో విరుచుకుపడ్డ నిఖత్.. అలవోక విజయంతో రెండో రౌండ్‌కు దూసుకెళ్లింది. నిఖత్‌తో పాటు మీనాక్షి (48కి.), అనామిక (50కి.) సైతం తమ ప్రత్యర్థులను చిత్తు చేశారు. ఇష్మీత్ సింగ్ (75కి.), సోనియా (54కి.) ఆరంభ బౌట్‌లోనే ఓటమిపాలయ్యారు.

భారత సీనియర్ మహిళల ఫుట్‌బాల్ జట్టు ఈనెల 16 నుంచి 28 వరకు హైదరాబాద్ లోని శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్‌లో ప్రత్యేక శిక్షణ శిబిరంలో పాల్గొననుంది. ఈ శిబిరానికి ఎంపికైన జట్టులో తెలంగాణ అమ్మాయి జి.సౌమ్య కూడా ఉంది.

పీఎస్‌జీకి చివరి హోం గేమ్ ఆడిన ఎంబాపె

పారిస్: ప్రఖ్యాత ఫుట్‌బాల్ ఫ్రాంచైజీ పారిస్ సెయింట్ జర్మన్ (పీఎస్‌జీ)తో ఏడేండ్ల బంధాన్ని త్వరలో తెంచుకోనున్న ఫ్రెంచ్ ఫుట్‌బాల్ యువ సంచలనం కిలియన్ ఎంబాపె.. ఆ జట్టు తరపున చివరి హోమ్ గేమ్ ఆడేశాడు. పారిస్‌లోని పార్క్ డి ప్రిన్సెస్ వేదికగా ఆదివారం రాత్రి పీఎస్‌జీ.. 1-3 తేడాతో టోలోస్ ఫుట్‌బాల్ క్లబ్ చేతిలో ఓడినా ఈ మ్యాచ్‌లో ఎంబాపె ఓ గోల్ కొట్టాడు. 2017లో పీఎస్‌జీతో ఒప్పందం కుదుర్చుకున్న అతడు.. ఈ క్లబ్ తరపున మరో రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉన్న అవి ఇతర వేదికల్లో జరగాల్సి ఉంది. ఇదివరకే రియల్ మ్యాడ్రిడ్‌తో ఒప్పందం కుదుర్చుకున్న ఎంబాపె.. జూన్ 1న ఆ జట్టుకు తొలి మ్యాచ్ ఆడే అవకాశముంది.

టాటా నెక్సాన్ నయా మాడల్

ప్రారంభ ధర రూ.8 లక్షలు..

న్యూఢిల్లీ, మే 13: మార్కెట్లో అత్యంత ప్రజాదరణ పొందిన నెక్సాన్‌లో నయా వెర్షన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది టాటా మోటర్స్. ఎంట్రీ లెవల్ స్మార్ట్ రకం ప్రారంభ ధర రూ.7.99 లక్షలు. నాలుగు రకాల్లో లభించనున్న ఈ మాడల్ నెక్సాన్ స్మార్ట్ ధర రూ.8.15లక్షలు(పెట్రోల్), నెక్సాన్ స్మార్ట్ ప్లస్ రూ.9.20 లక్షలు(పెట్రోల్), డీజిల్ మాడల్ రూ.9.99 లక్షలు, స్మార్ట్ ప్లస్ ఎస్ మాడల్ పెట్రోల్ రకం రూ.9.80 లక్షలుగా నిర్ణయించింది. పాత మాడల్‌తో పోలిస్తే ఎంట్రీ లెవల్ మాడల్ ధర రూ.16 వేలకు తక్కువకే విక్రయిస్తున్నది. ఏడు అంగుళాల టచ్‌స్క్రీన్, 4 స్పీకర్ సౌండ్ సిస్టమ్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, ఎలక్ట్రానిక్ స్టేబిలిటీ కంట్రోల్, రియర్ పార్కింగ్ సెన్సార్ వంటి ఫీచర్స్‌తో రూపొందించింది.

యూపీఐకి జొమాటో గుడ్‌బై

పేమెంట్, వ్యాలెట్ లైసెన్స్ ఆర్బీఐకి అప్పగింత

న్యూఢిల్లీ, మే 13: ఫుడ్ డెలివరీ యాప్ జొమాటో.. పేమెంట్స్ సేవలకు గుడ్‌బై చెప్పింది. తమ పేమెంట్ అగ్రిగేటర్, వాలెట్ లైసెన్స్‌ను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)కు జొమాటో పేమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ (జెడ్‌పీపీఎల్) స్వచ్ఛందంగా అప్పగించింది. ఈ మేరకు జెడ్‌పీపీఎల్ మాతృ సంస్థ జొమాటో సోమవారం తెలియజేసింది. 'ఆన్‌లైన్ పేమెంట్స్ విభాగంలో ప్రత్యర్థి సంస్థలకు పెద్దగా పోటీనివ్వలేకపోయాం. అందుకే ఈ పేమెంట్స్ వ్యాపారం మాకు అంతగా లాభదాయకం కాదని గ్రహించాం. ఈ క్రమంలోనే పేమెంట్ అండ్ సెటిల్మెంట్స్ సిస్టమ్స్ యాక్ట్ 2007 కింద ఆర్బీఐ నుంచి పొందిన లైసెన్స్‌ను తిరిగి ఇచ్చేశాం' అని జొమాటో స్పష్టం చేసింది. 2021 ఆగస్టులో జెడ్‌పీపీఎల్ మొదలైంది. అదే ఏడాది నవంబర్‌లో ఆర్బీఐకి లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నది. నిరుడు మే నెలలో గూగుల్ పే, పేటీఎం, ఫోన్‌పేలకు పోటీగా జొమాటో యూపీఐ సేవల కోసం ఐసీఐసీఐ బ్యాంక్‌తో చేతులు కలిపింది. ఇక ఈ ఏడాది జనవరిలో ఆర్బీఐ నుంచి లైసెన్స్ వచ్చింది. కానీ ఇంతలోనే జొమాటో వెనక్కి తగ్గడం గమనార్హం. ఇదిలావుంటే జెడ్‌పీపీఎల్‌లో జొమాటో రూ.39 కోట్ల పెట్టుబడులను పెట్టింది.

లాభాల్లోకి జోమాటో

మార్చి త్రైమాసికానికిగాను జొమాటో రూ.175 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో సంస్థకు రూ.188 కోట్ల నష్టాన్ని నమోదు చేసుకున్నది. అలాగే ఏడాది క్రితం రూ.2,056 కోట్లుగా ఉన్న కంపెనీ కన్సాలిడేటెడ్ ఆదాయం గత త్రైమాసికానికిగాను రూ.3,562 కోట్లకు ఎగబాకింది.

విద్య, వివాహం, గృహాలకు ఆటో క్లెయిం: ఈపీఎఫ్‌వో

న్యూఢిల్లీ, మే 13:గడిచిన ఆర్థిక సంవత్సరంలో రిటైర్‌మెంట్ ఫండ్ బాడీ ఈపీఎఫ్‌వో 4.45 కోట్ల క్లెయింలను సెటిల్ చేసింది. అలాగే 2.84 కోట్ల అడ్వాన్స్ క్లెయిం సెటిల్‌మెంట్లు కూడా ఉన్నాయని గత ఆర్థిక సంవత్సరానికిగాను విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ప్యారా 68కే ప్రకారం విద్యా, వివాహం, 68 బీ ప్రకారం గృహ కొనుగోలుకు సంబంధించి ఆటో క్లెయిం చేసుకోవడానికి అనుమతినిచ్చింది. ఇటీవల లిమిట్‌ను రూ.50 వేల నుంచి లక్ష రూపాయల వరకు పెంచిన విషయం తెలిసిందే. దీంతో లక్షలాది మంది ఈపీఎఫ్‌వో ఖాతాదారులకు ప్రయోజనం కలుగనున్నది.

వాణిజ్య

రిస్క్‌లో దేశీయ బ్యాంకులు

పూచీకత్తు ప్రమాణాలు అస్తవ్యస్తం

రుణాల వృద్ధిపై సంబురపడలేం: ఫిచ్ రేటింగ్స్

న్యూఢిల్లీ, మే 13: భారతీయ బ్యాంకింగ్ రంగం ప్రమాదంలో ఉన్నదని అమెరికాకు చెందిన ప్రముఖ అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ హెచ్చరించింది. పూచీకత్తు ప్రమాణాలు లోపభూయిష్టంగా ఉన్నాయన్నది. ఇటీవలికాలంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) సైతం పర్యవేక్షణ లోపాలు, నిబంధనల ఉల్లంఘనలపై ఆందోళన వ్యక్తం చేస్తూ పలు బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లపై కొరడా ఝుళిపించిన విషయం తెలిసిందే. ఆయా సంస్థలపై రకరకాల ఆంక్షలనూ విధించిన సంగతీ విదితమే. ఈ నేపథ్యంలో ఫిచ్ రేటింగ్స్ హెచ్చరిక అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంటున్నదిప్పుడు. 'భారతీయ బ్యాంకులపై రిస్క్ ప్రొఫైల్ ప్రభావం ఎక్కువ' అనే శీర్షికతో సోమవారం ఫిచ్ ఓ నివేదికను విడుదల చేసింది. ఇందులో రుణాల్లో వృద్ధి నమోదైందని సంబురపడాల్సిన పనిలేదని, ఆ రుణాలతో కనిపించని ఇబ్బందులు ఎన్నో ఎదురుకావచ్చని హెచ్చరించడం గమనార్హం.

రిటైల్ రుణాలతో..

ఈ ఏడాది మార్చితో ముగిసిన గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ రుణాలు 16 శాతం పెరిగాయి. ఇందులో రిటైల్ రుణాలు దాదాపు 10 శాతంగా ఉన్నాయి. 2020-21 నుంచి చూస్తే వీటి వార్షిక చక్ర వృద్ధిరేటు (సీఏజీఆర్) 20 శాతంగా ఉన్నది. అయితే పర్సనల్ లోన్లు, క్రెడిట్ కార్డుల వంటి రిటైల్ రుణాల్లో పెరుగుదల.. మొత్తం లోన్లకున్న ముప్పును పెంచుతుందని ఫిచ్ చెప్తున్నది. ఈ అన్‌సెక్యూర్డ్ లోన్లు ఎంత పెరిగితే అంత ఇబ్బందులేనని పేర్కొన్నది.

లోపాలు అనేకం

రిటైల్ రుణాలకు సంబంధించి పాటిస్తున్న పూచీకత్తు ప్రమాణాల్లో పారదర్శకత చాలా తక్కువగా ఉందని ఫిచ్ చెప్తున్నది. లోన్-టు-వాల్యూ రేషియో, రుణగ్రహీత రుణ చరిత్ర, రుణాలు తీసుకునేవారి ఆర్థిక సామర్థ్యం, వారి క్రెడిట్ స్కోర్, రికవరీ శాతం వంటి అంశాల్లో ఇతర ఆసియా దేశాల బ్యాంకులతో పోల్చితే భారతీయ బ్యాంకుల్లో ప్రమాణాలు సరిగా లేవని ఫిచ్ ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో నిబంధనల అమలు ఒకింత నిర్లక్ష్యంగా ఉన్నదన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చిన ఫిచ్.. ఈ విషయంపై ఆయా బ్యాంకులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని చెప్పింది.

గృహస్తుల రుణాలు తక్కువే

ప్రపంచంలోని ఇతర దేశాలతో పోల్చితే భారత్‌లోని గృహస్తుల రుణాలు తక్కువేనని ఫిచ్ చెప్పింది. నిజానికి అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2022-23)తో పోల్చితే గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో జీడీపీలో ఈ రుణాల వాటా 38 శాతం నుంచి 40 శాతానికి పెరిగింది. అయినప్పటికీ ఇతర దేశాలతో చూస్తే హౌజ్‌హోల్డ్ డెట్ తక్కువగానే ఉన్నట్టు ఫిచ్ గుర్తుచేసింది. కాగా, ఇటీవలే ఆర్బీఐ.. గృహస్తుల పొదుపు పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ క్రమంలోనే రుణాలు ఎక్కువగా తీసుకుంటున్నారని చెప్పినది తెలిసిందే.

300 శాఖలు.. 15 వేల ఉద్యోగాలు

2024-25 విస్తరణ ప్రణాళికను ప్రకటించిన ఎస్బీఐ

న్యూఢిల్లీ, మే 13: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) భారీ విస్తరణ ప్రణాళికను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 300 శాఖలతోపాటు 15 వేల మంది సిబ్బందిని నియమించుకోవాలనుకుంటున్నట్లు బ్యాంక్ చైర్మన్ దినేశ్ ఖారా తెలిపారు. వీరిలో అత్యధిక మంది మార్కెటింగ్ విభాగానికి చెందినవారని, అలాగే 11-12 వేల మంది ప్రోబేషనరీ ఆఫీసర్ స్థాయి ఉద్యోగులను సైతం రిక్రూట్ చేసుకోనున్నట్లు ఆయన ప్రకటించారు. ఆఫీసర్ స్థాయి ఉద్యోగులతోపాటు ఇంజినీర్లు కూడా ఉన్నారన్నారు. గతేడాది బ్యాంక్ 139 శాఖలను ప్రారంభించడంతో మొత్తం సంఖ్య 22,542 లకు చేరుకున్నాయి. మరోవైపు, బ్యాంక్‌నకు సంబంధించి సబ్సిడరీ సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న వారి సేవలను కూడా బ్యాంక్ వినియోగించుకోబోతున్నది. ముఖ్యంగా ఆఫీస్ వర్క్, మార్కెటింగ్, రికవరీ కోసం వీరిని వాడుకోనున్నది.

-800 నుంచి +111

భారీ నష్టాల నుంచి కోలుకున్న సెన్సెక్స్

ముంబై, మే 13: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలకు బ్రేక్‌పడింది. ప్రారంభంలో కుప్పకూలిన సూచీలకు చివరి గంటలో మదుపరులు ఎగబడి కొనుగోళ్లు జరపడంతో సూచీలు తిరిగి లాభాల్లోకి వచ్చాయి. బ్లూచిప్ సంస్థలైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, టీసీఎస్‌ల షేర్లకు మదుపరుల నుంచి లభించిన మద్దతు వల్లనే లాభాల్లోకి రాగలిగాయి. ఇంట్రాడేలో 800 పాయింట్లు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 111.66 పాయింట్లు లాభపడి 72,776.13 వద్ద ముగిశాయి. అలాగే ఒకానొక సమయంలో 310 పాయింట్లు నష్టపోయిన ఎన్ఎస్ఈ నిఫ్టీ మార్కెట్ ముగిసే సమయానికి 48.85 పాయింట్లు అందుకొని 22,104.05 వద్ద ముగిశాయి.

- ఏషియన్ పెయింట్స్ 4 శాతం వరకు పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది.
- దీంతోపాటు యాక్సిస్ బ్యాంక్, టీసీఎస్, సన్‌ఫార్మా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, టాటా స్టీల్, పవర్‌గ్రిడ్, ఎల్‌అండ్‌టీ, కొటక్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫిన్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌యూఎల్, విప్రోలు లాభాల్లో ముగిశాయి.
- ఆర్థిక ఫలితాలు అంచనాలకుమించి రాణించినప్పటికీ టాటా మోటర్స్ షేరు ధర 8.34 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది.
- అలాగే ఎన్‌టీపీసీ, భారతీ ఎయిర్‌టెల్, ఎస్బీఐ, టైటాన్, నెస్లె, ఇండస్‌ఇండ్ బ్యాంక్, రిలయన్స్, ఐటీసీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, టెక్ మహీంద్రా, మహీంద్రా అండ్ మహీంద్రా, ఇన్ఫోసిస్, మారుతి షేర్లు నష్టపోయాయి.
- పార్లమెంట్ ఎన్నికల ముగిసేవరకు మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకు లోనుకానున్నాయని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.
- బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లు నష్టాల్లో ముగిశాయి.
- రంగాలవారీగా చూస్తే సేవలు 1.41 శాతం, రియల్టీ 1.32 శాతం, హెల్త్‌కేర్ 1.15 శాతం, ఇండస్ట్రీయల్స్ 1 శాతం, కమోడిటీస్, బ్యాంకింగ్ రంగ సూచీలు లాభాల్లో ముగిశాయి.
- కానీ, కన్స్యూమర్, టెలికమ్యూనికేషన్, యుటిలిటీ, వాహన రంగ షేర్లు నష్టపోయాయి.

అక్కడక్కడే రూపాయి

డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ సోమవారం యథాతథంగానే ఉన్నది. ఫారెక్స్ మార్కెట్‌లో భారతీయ కరెన్సీ 83.51 వద్దే ముగిసింది. ఒకానొక దశలో స్వల్పంగా పెరిగి 83.53 స్థాయికి చేరినా.. చివరకు శుక్రవారం ముగింపు స్థాయి 83.51 దగ్గరకే వచ్చి ఆగింది. ఇదిలావుంటే విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐలు) దేశీయ మార్కెట్ల నుంచి తమ పెట్టుబడులను మున్ముందూ వెనక్కి తీసుకుంటే.. రూపాయి విలువపై మరింత ప్రతికూల ప్రభావం తప్పదని మార్కెట్ ట్రేడర్లు విశ్లేషిస్తున్నారు. అయితే బాండ్ ఆధారిత డాలర్ల ప్రవాహం ఉంటే మాత్రం రూపాయి బలపడగలదని అభిప్రాయపడుతున్నారు.

వార్‌బర్గ్ గూటికి శ్రీరామ్ హౌజింగ్ ఫైనాన్స్

న్యూఢిల్లీ, మే 13: శ్రీరామ్ ఫైనాన్స్‌కు చెందిన శ్రీరామ్ హౌజింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌ను అమెరికాకు చెందిన ప్రైవేట్ ఈక్విటీ వార్‌బర్గ్ పింకస్ కొనుగోలు చేసింది. ఒప్పందం విలువ రూ.4,630 కోట్లు. ఈ కొనుగోలు ఒప్పందానికి రెగ్యులేటరీలు, నియంత్రణ మండళ్లు అనుమతించాల్సి ఉంటుంది. ఈ ఒప్పందం వచ్చే ఏడాది ఫిబ్రవరి 7 వరకు పూర్తికావచ్చునని శ్రీరామ్ ఫైనాన్స్ బీఎస్ఈకి సమాచారం అందించింది.

కోరమాండల్ చేతికి దక్ష

హైదరాబాద్, మే 13: డ్ర